# శ్రావణమంగళవారం

జనమంచి కామేశ్వరరావుగారు

నదిగట్టున కూర్చున్నాడు. విహాయసమున వింతకూజితాల సద్దుమొదలయింది. సాగరసంగమం పొందాలని పొంగెత్తి ప్రవహిల్లుచున్న గోదావరి ఒకసారి తరంగనేత్రాలెత్తిచూచింది. రమ్మని తరంగహస్తాలెత్తిపిలిచింది. అతనిపాదాలు పావంచాలక్రింద నీళ్లలో వున్నాయి. చిరుమీనలు మిలమిలమెరుస్తూ వాటినిగోకి కితకితలులేపేయి. కాని అతను నిశ్చలంగానే కూర్చున్నాడు.

* * *

ఉన్నిద్రమైనయువిద ఒకర్తుక శివాలయంలోపలినుండి వీధి అరుగుమీద పరుచుకున్న కోమటమ్మ అంగడిదరిగా కూర్చొని ఆమెతో ఏదో ఊసులాడుతున్నది. శ్రావణ మంధర జలధరగాతమితో తూగులాడుచున్నది. ఆమె యౌవనముఖము త్రపాముద్రితం. జ్యోతిఃప్రభనిచ్చుకళ్లు, వయసుపోకిళ్ల బిగయబట్టిన సౌందర్యం. సహజలావణ్యమే జపాసనం పట్టించిన ప్రసన్నత దొరలించు దృక్కులు. సౌందర్యార్చనచేసే శివదీక్షాపరురాలు. దేవునికి తనశరీరము ఆత్మ సమస్తమూ నిలువుదోపిచ్చుకున్నది. ఆమె జీవితము శివేశ్వరుని చరణాంకితగీతి.

నిరుడు శ్రావణంలో జీవితం రసప్లావితం. ఈపడూఅంతే.

నిరుడు వరదకట్టి పొంగింది గోదావరి. ఈపడూ పొంగింది.

ఆమెలో యౌవనంపొంగు నిరుటికన్న పెద్దయింది ఈపడు.

నిరుటిపొంగు భర్తృకప్రేమతత్పరతలో నిలిచింది. ఈపడు శివధ్యానతత్పరతలో పొరలింది.

నిరుడు కళ్లల్లో కానిపించేరూపు ఈపడు కళ్లుమూసికొని హృదయంలో యిముడ్చుకున్నది. తనఎదుట దానినే అర్చనకు అలవాటుపడిన దగుటచే శివుని రూపున ప్రతిష్ఠించుకున్నది.

ఆకాశం కారుమేఘాలముసుగు. ముసుగులోనుండి విహ్వలనేత్రాలతో మెరపుకన్నెలువిరహాలాలసలో ప్రియాన్వేషణం చేస్తున్నాయి. ప్రకృతంతావిశ్లేషాశ్రువుల ముసురుపట్టింది. పెంపుడు నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. వానముసురుకి ప్రియుడు ప్రేయసిరాకకై తల్లడిల్లిపోతున్నాడు. ఊర్వసి నేర్వాలని ఉవ్విళ్లూరిన నాట్యవిన్నాణాలు నెమళ్లు అవలీలగా చూపుతున్నాయి.

నిరుడు శ్రావణమంగళవారం పేరంటానికి పోయి గట్టుమీదుగా వస్తూ, తేమలో నడవడంచేత బురదైన కాళ్లు కడుక్కుందామని రెండుపావంచాలుదిగి కాళ్లురాపాడ ఒంత్రుమట్టికి జారి, ఓసరిలి, ఆమెనీళ్లలో పడిగతించింది.

* * *

నిరుటిశ్రావణంలో అతని జీవితం రసప్లావితం. ఈపడు నిర్వాసనాప్లావితం.

నిరుడు కాంతకౌగిలింతలు. ఈపడు విషాదపు పుక్కిలింతలు.

* * *

అతను క్రిందమెట్టుమీద కూర్చుని జీవితంలో ప్రేమలో పావిత్ర్యము కుంభించుకున్న తన ప్రేయసి అకాలమృత్యుగ్రస్తమవడం తలచుకొంటున్నాడు. తనువెల్లనిట్టూర్పుదొంతరలై విడిపోయి, వరదకట్టి పారునదిమీద తేలివచ్చు శీతగాలికిచివికి, బాష్పాలజడులై సెలజాలులై వరదల నుద్ధృతంచేస్తున్నాయి. ప్రేయసి జలదాంగనయి ఎప్పటికైనా తేలివచ్చుననే ఆశయే ప్రతిదివసాంతమందు అతన్నక్కడ నిలుపుతూన్నది. తడికళ్లు తుడుచుకుని రెప్పల్లోనుంచి గ్రుడ్లు పెకల్చి అదేతేరిపార తనప్రియురాలిని కబళించిన పావంచాక్రిందకు చూస్తాడు. వరదపుల్లలు చిక్కుకొని కొట్టుకొని వస్తూన్న చీకుకంప చూసి భ్రమపొందుతాడు.

ప్రియావియోగం అతనిచూపుల్లోనివ్వెరనిల్పింది. నడలలో సోమరితనంసడల్చింది. దేహము సవసిపోయింది. రూపు దూళిదూసరితము. హృదయం బాధాస్నపితము.

“వెదకి వేసారి ఈవెర్రిబ్రతుకెపుడేని
తుదిరేయి కనుమూయునా?”

ఇదే అతనిధ్యానగీతి. ఇదే అతని జీవితసందేహంకూడాను.

* * *

శ్రావణమంగళవారం. సాయంకాలం. సూర్యాస్తమయమయింది. అంతిమఅరుణరేఖలు కూడ అరిపోయినాయి. ప్రకృతి విషాదంపోసికొను మునిమాపులో కుహూస్వనాలు నీరసించాయి. మేడవారింటికి పేరంటమునకు పోయి తిరిగి “వంటకు వేళైంది” అనిఒకరూ “పిల్లాడ్ని అత్తగారికి ఒప్పగించి వచ్చేను. పాలకు హంగామాచేస్తున్నాడేమో” అని మరొకరూ యిల్లావాళ్లలో వాళ్లే కబుర్లు చెప్పుకుంటూ ఉరకలమీద, పరుగులమీద, సెనగలమూటలు పట్టుకొని, మొకపిల్లల్ని చంకలపెట్టుకొని, పెద్దముత్తైదువులు యిళ్లుచేరుకుంటూ, శివాలయం దగ్గరఆగి, దూరాన్నుంచే గర్భగుడి వైపు తిరిగి, నమస్కారంచేస్తూ లెంపలు వేసికొని, పోతున్నారు.

ఎదురుగా పసుపుపేరంటాండ్రు పట్టురెక్కపురుగుల్లా బారులుతీర్చి పులుకుపులుకు, పచ్చకర్పూరముమెసవిన కాటుక కళ్లతో, అటుయిటు చూసుకుంటూ, నిరుడు వారితోపాటు పేరంటమునకువచ్చిన, గతభర్తృకయినా కుంకుమతిలకము, కళ్లకాటుక, మంగళరూపము, మాంగళ్యసూత్రము వదలక నిశ్చింతగాకూర్చుని మాటలాడుచున్న లక్ష్మిని చూశారు. వెలపరము వెల్లిగ్రక్క చీదరించుకుంటూ వెర్రిదానిని ఎకసక్కెమాడినట్లు “నీభర్త ఎక్కడున్నాడు?” అని అందరూ ఒక్కసారి రంకెవేశారు.

“నాదేవాలయంలో, నాశివునిలో, నాహృదయంలో” అంటూ వెర్రిగా అమాయికంగా సమాధానమిచ్చింది లక్ష్మి. ఆమె మాటలు ఒక్కసారి వారి ప్రతిహృదయంలోను ప్రతిశబ్దించేయి. కాని విషపునవ్వు చిచ్చులు ఆలయప్రదేశమంతా విరజిమ్మి శ్రావణమంగళవారపు సెనగలవాయనాలకు తరలిపోయినారు ముత్తయిదువులు.

దారిలో పావంచాలమీద కూర్చుని వెక్కివెక్కి “అయ్యో! అయ్యో!” అని

కుములుతూన్న కాంతమ్మభర్త వెంకట్రావును చూసి, అతని దురవస్థ మెరపుసేపులో గుణించుకొని "పాపం! మనకాంతమ్మభర్తే! వెంకట్రావే!" అని జు జు అనుసానుభూతి వచనాలతో సాగిపోయినారు.

వెంకట్రావు విరహబాధకు ఈలోకపు సానుభూతి దొరకింది.

లక్ష్మికి తిండ్రింపులు, ఈసడింపులే ఈ లోకులు కూర్చినమణిహారం.

నీలిమాదేవి అభిసారికయి అడుగు చప్పుళ్లు అన్వేషణమునకు అడకువ నివ్వగా నిశిరాజుకోసం పరువుపరువున బరువు ఒడలతో వస్తూఉన్నది.

వెంకట్రావు చెట్టుకొమ్మమీద గుడ్లగూబ. క్రింద భయదజీమూతంలో జలజల స్రవించు పూర్ణనది. శివాలయంలో దీపారాధనచేశారు. గంటలు మ్రోగుచున్నాయి. లక్ష్మి దేవళంలోనికిపోయి ప్రదక్షిణంచేసి దేవదర్శనం కావించుకున్నది. ఆమె అర్చనలో నైశ్చల్యం సౌందర్యం పుంజీభవించేయి. వేపుడుసెనగల నైవేద్యం పెట్టింది.

వెంకట్రావు ముత్తయిదువులను చూచి, శ్రావణమంగళవారం తలచికొని, ప్రేయసినితలచికొని వియోగార్తిచే పొగిలి పోతున్నాడు.

* * *

శివాలయంలోని జయఘంటలతన్ని శోకంకూర్కులోనుండి లేపేయి. లేచి మొగము నీళ్లలో కడుగుకున్నాడు. పాదప్రక్షాళనంచేశాడు. దేవాలయంలోనికిపోయి ప్రదక్షిణంచేసి విభూతిమొగాన్ని పెట్టుకొని శివానందలహరి, ముకుందమాలలోని శ్లోకాలు పఠిస్తూ లోలోన ప్రియావియోగమననాన్ని అదిమిపెట్టి బాధవిముక్తిపొంది బైటపడిన భక్తిలో కొంతసేపు నిలిచేడు.

లక్ష్మి నైవేద్యంపెట్టిన సెనగలదోసిలితో కళ్లుమూసికొని శివునికి శ్లోకార్చన చేస్తూఉన్న వెంకట్రావు ఎదుట నిలిచింది. పెట్టిన విబూదిపెండికట్లు, నొసటను కుంకుమబొట్టు, ధ్యానాసక్తిలోవేసిన పద్మాసనం చూచి సాకారుడైన శివుడే అనుకున్నది. నిశ్శంకతో, సమధికోత్సాహంతో కృశాంగియై వెంకట్రావును "స్వామీ! చేయి పట్టుడు" అని పలికింది.

వెంకట్రావు ధ్యాననిమగ్నతలో ప్రియరూపం దృక్గతమైఉండగా అవశుడై వున్నాడు. ఆమెమాటలు వీనులుచొరగానే ప్రియరూప భావనాప్రమత్తతలో దోసిలిపట్టి ఆమెదోయిలిని, సెనగలను అట్టులేపట్టుకొని నిలిచిపోయినాడు.

* * *

ఆలయం వెనుకభాగమున సౌదామిని చమక్‌మని చూచింది. ప్రావృట్ మేఘుడు ఆమెదృక్సందేశమును పోల్చుకొని శంఖం పూరించేడు.

"భక్తిపారవశ్యంలో ప్రేమకు ప్రతిఫలం వుంది" అని ఈసందేశమునే వరుణుడు తన సహస్రధాకలితవర్షధారాతంత్రుల వీణియపై మీటినాడు.

శివదర్శనానికి వస్తూండే అర్చకుల అడుగుసందళ్లలో కరగిపోయింది ఆ అతిలోక దృశ్యం.